క్రమకొవల నుండి వెనక్కు చూసుకొని, జుట్టు ముడిపై గ్రుచ్చుకొన్న మల్లెలవరుస అర్ధ చంద్రాకృతిలో సరిచేసుకొని, ఎడమచేతితో చీర కొంగు ముందుకు తీసుకొని, పిల్లవాణ్ణి ప్రక్కకు నడిపించి తనసీటువద్దకు వచ్చి కూర్చుంది చంద్రికా రాణి.

అది తెలుగు సినిమాకాదు. ఆమెకు కావలసినవి పాతివ్రత్య మహాత్మ్యాలూ, ధర్మమే జయాలూ కావు. ఒక్క రెండుగంటల కాలంలో దొరికే సున్నితమైన వినోదం. చంద్రికారాణికి సినిమాల మోజు ఎప్పుడూలేదు. భరత్‌బాబు యీరోజున పట్టుబట్టాడు. తాను వద్దన్నది. వాడి కళ్లలో నీలాలు కదలాడగానే తానిక కాదనలేకపోయింది. ఇలాస్టిక్ శాండో బనియన్ వేసుకుని, క్రికెట్‌హేట్ పెట్టుకుని వాడు తయారవడంతో ఆమెకు నవ్వొచ్చింది. చలిగాలి తగులకుండా మెడకు సిల్కు రూమాలు కోసమనితానులోపలికిపోయి వచ్చేసరికి, డ్రైవర్‌ని పిలిచి కారు పోర్టికోలో పెట్టించాడు వాడు.

చంద్రికారాణి పెదవులలోపల సన్నగా నవ్వుకొంది. ముందుకువంగి కొడుకు బుగ్గలు పుణికింది. తన తెలివినంతనీ కళ్లలోకి తెచ్చుకొని గొప్పగా చూశాడువాడు.

అలా వాడివైపు చూస్తుండగా, వెనకటిస్మృతి ఒక్కటి లీలగా కదలి కళ్లు కలవరపడినాయి. కనుమొన మునివ్రేలితో తుడుచుకునేలోగా, వాడు పోయి కబర్డులో పర్సూ, వానిటీబ్యాగ్ తీసుకు వచ్చాడు.

ఫలాని థియేటర్ అని డ్రైవర్‌తో ఆమె చెప్పలేదు. కుర్రవాడు ముందేచెప్పిఉండాలి. ప్లాజాలో వాళ్లని విడిచి భోజనానికి యింటికి పోయాడు డ్రైవర్.

హాల్లో ఉన్నంతసేపూ భరత్‌బాబు సంతోషంతో చప్పట్లు చరుస్తూనే ఉన్నాడు. క్రింది తరగతివాళ్లతో సమంగా వాడూ యీలలు వేయడంతో చంద్రికారాణి కనుబొమలు ముడిచి చూసింది. వాడు వెకిలిగా నవ్వాడు. ఆమె తల




# అనువ్రత

పోరంకి దక్షిణామూర్తి

త్రిప్పుకొంది. అలా త్రిప్పుకుంటూ ఉండగా ఆమె మనస్సులో చిన్న సంశయం కదిలింది. వీడి హుషారుకి ముందుసీట్లలో ఒకరిద్దరు వెనక్కు తిరిగి చూశారు.

'నీలిరంగు'బో'లో'అతనురమాకాంత్‌కాదుకదా?'

సంశయం వెనకే నమ్మకమూ కలిగింది.

రమాకాంతరావును కాలేజి రోజుల్లో ఆమె ఎరుగును. అతడు లలిత కళాసమితి కార్యదర్శిగా ఉండేవాడు. ఆరోజుల్లోనే అతడు కార్లలో తిరిగేవాడు.

అద్దాల చోలీమీదికి కనకాంబరాల కొసలు వ్రేలాడుతుండేట్లు బర్మాముడి వేసుకొన్న సన్నని పూచికపుల్ల, అతని భార్య!

ఆరోజుల్లోనే, ముంగి ముషాణాలవంటి ఆడపిల్లలు సహితం అతనితో నవ్వుతూ మాట్లాడేవారు!

రమాకాంతరావూ, అతని భార్యా ఎందుకో తెగ నవ్వుకుంటున్నారు.

భరత్‌బాబు యాలవేశాడు మళ్ళీ.

నవ్వుతోనే వెనక్కి తిరిగారు వాళ్ళు.

సిగ్గుతో తలవంచుకొంది చంద్రికారాణి. అవమానంమాట అటుంచి, కొంత అసూయ కూడా లేకపోలేదు.

అతడు గవర్నమెంటులో ఆఫీసరు హోదాలో ఉన్నాడని వెనక రాధా, వసంత చెప్పగా విన్నది. ఈ వూరు ఎప్పుడు ట్రాన్సఫర్ అయిందో!

ఆ లెక్కకు యిప్పుడు తన హోదాకంటే అతడిది ఎక్కువకాదు. కాని అతని భార్యకు ఆ అతిశయం ?

కాకి ముక్కుకు దొండపండున్నట్లు దొరికాడు. కొంగుకు కట్టుకు తిరుగుతోంది.

అసలు ఎవరమ్మాయో ? ఎక్కడాచూసినట్లు లేదే? డబ్బుకి కక్కుర్తిపడిపెల్లెటూరివం బంధం చేసుకున్నాడా ? వేషంతో అంత మోసం చెయ్య గలదా ? ఇంతోటి మొగుడూ తనకే ఉన్నాడనా ?

తనలో వెలితి వ్రేలెత్తి చూపినట్లనిపించింది చంద్రికారాణికి. అవును, ఆమెకు ఆ అతిశయం ఉండడంలో తప్పులేదు. అతడు అందగాడు. కావలసినంత గడించిపోస్తున్నాడు. పైలాపచ్చీసుగా తిరుగుతారు. దిగుళ్ళులేని కళ్లతో తృప్తిగా నవ్వుకుంటారు. కనుబొమలు విరిచి ఆమె తనవైపు చూడటంలో తప్పేముంది ? సుఖమనేది మనిషి మాటలోనూ, చూపులోనూ, హావభావాల్లోనూ, నడకలోనూ, నాజూకుతనంలోనూ ప్రస్ఫుటంగా కన్పిస్తూనే ఉంటుంది. వాళ్లకి సుఖం ఉంది. అనుభవిస్తున్నారు. తనకంతయీర్ష్య ఎందుకు ?

చంద్రికారాణిలో యీర్ష్యకు తావులేదు. అవసరమూలేదు. చక్కగా చదువుకొన్నది. మంచి మార్కులతో ప్యాసయింది. అలాకాగలదని ఆమెకే నమ్మకంలేకపోయింది. యూనివర్శిటీచదువులో మామావాళ్లే, కొమ్ములు తిరిగిన మొనగాళ్లు సైతం పాద్రావరుల్లో దిగారు. తనకు ఫస్ట్ క్లాస్ వచ్చింది. 'అదృష్టం!' అన్నారు కొందరు. కాబోలు. 'కష్టపడి చదివావులే!' అన్నారు. తన కంటె కష్టపడ్డ వాళ్లు తనకు తెలుసు'(ప్రొఫెసర్ మంచివాడు!' ఎంతమందిపట్ల ? 'ఆడవాళ్లంటే సానుభూతి ఉన్నవాడు!' వ్యంగ్యం ?

తాను అందకత్తెననే విషయం గుర్తుకు వచ్చింది చంద్రికకు. తన అందం విషయంలో తనకు తృప్తి ఉంది. గర్వమున్నూ! కమల నయన అలాగని దెప్పుతూ ఉండేది. పాపం! దానికి ఎలాటి మొగుడు దొరికా డో?

కమలనయన తెల్లగా పాలరాతి బొమ్మలా ఉండేది. ఆ అమ్మాయిని చూసినవాళ్ల నవాబు కుటుంబాలకు చెందినపిల్ల అని భ్రమపడేవారు. మూలస్థానం అగ్రహారం వ్యాఘ్రేశ్వర సోమయాజులుగారి మూడో మనవరాలని ఎవరికి తెలుస్తుంది కనక? ఒంటికి అంటేపెట్టుకుని ఉండే బట్టలు కట్టుకోవాలని దానికి ఎప్పుడూ సరదా ఉండేది. కాని దానిది కాయశరీరం.

''పెళ్లి చేసుకో! నీకూ ఒళ్లొస్తుంది.''అన్నది తను. అనగా, తనకి పెళ్లికాకుండావే వచ్చిన వొళ్ళు ఆమెకు పెళ్లిచేసుకుంటే రాగలదని తాత్పర్యం.

అలా అనుకుంటూ ఉండగా, హాల్లో ఉక్కగా ఉన్న సంగతి గుర్తుకు వచ్చింది చంద్రికకు. రేపు షాపింగుకుపోయికొత్తజాకెట్లకు గుడ్డలు తీయించాలనుకుంది. బద్ధకంగా వొళ్ళు విరుచుకుంది. చిన్న ఆవలింతా వచ్చింది. అసంకల్పితంగా జారవిడచిన కొంగు వెనక్కు తిరిగి తీసుకొని, నడుం చుట్టూ వొత్తుగా త్రిప్పుకుంది. అంచు నడుము దగ్గర చేతితోపట్టి అదిమినట్లుగా అంటి పట్టుకొని అరచేతి వెడల్పున ముందుకు వచ్చింది.

చీర సవరించుకొనడంలో, భుజాలు చూసుకోవడంలో, మెడలో రాళ్లనెక్లెస్ సర్దుకొనడంలో అప్పుడే బొటనవ్రేలితో నీలిరాయి ఉంగరం తడుముకొనడంలో ఒకదానిమీద మరొకటిగా గాజులు జారుతూఉంటే సరిచేసుకొనటంలో, బొడ్డుక్రింద కుచ్చెళ్ళ నలగకుండా చూసుకొనడంలో,చూపులోనూ,చేతికదలికలోనూ,కూర్చున్న పద్ధతిలోనూ చంద్రికారాణి హోదా, అందమూ, తీవి ప్రస్ఫుటమవుతున్నాయి. వీటన్నిటికీ ఆడుగున వల్లమాలినంత అహంభావం ఉంది.

తమకు లేనివాటినిగూర్చి యిదవుతూఉంటారు కొందరు. ఎదుటివాళ్లకు లేనివి చూసి తృప్తిపడుతూ ఉంటారు మరికొందరు. ఎదుటివాళ్లకు ఉన్నవిచూసి యేడ్చేవాళ్లు యింకా కొందరు. తమవి తాము చూసుకుంటూ పూ. . . మురిసిపోయేవాళ్లు చాలామంది ఉంటారు. చంద్రిక యీకోవకు చెందినది. అలా మురిసిపోవడమే కాకుండా చూసినవాళ్లు తమను మెచ్చుకోవాలి. అధమం మెచ్చుకునేటట్లుగా నయినా చూడాలి. అది వేయిఏనుగుల బలం. అప్పుడామెకు మదగజయానమేవస్తుంది. చూసేవాళ్లంటే మూరమ్మలకి మాత్రం రాదుకనకనా ?

చంద్రికారాణికి తలనొప్పి వచ్చింది. కళ్లకు బడలిక వచ్చింది. రుమాలుతో ముఖం తుడుచుకుంది. తుడుచుకుంటున్నప్పుడు మొగలిసెంటు గుప్పుమన్నది. ఆమెకు పెళ్లినాటి తొలిరోజులు జ్ఞాపకం వచ్చాయి.

అతనికి జాస్మిన్ అంటే యిష్టం. ఆమెకు మొగలిసెంటు యిష్టం. ఒకనాడు రాత్రి, అతను జాస్మిన్ తెచ్చాడు. ఆమె సీలు యిప్పలేదు. పైగా మొగలిసెంటంతా పక్కమీద గుమ్మరించింది!

ప్రతి చిన్న విషయంలోనూ తన వ్యక్తిత్వం నిలుపుకోవాలని చూసేది చంద్రికారాణి. అతను పెద్ద అందగాడుకాడు. తనకు అది ఉందని ఆమె దృఢమైన నమ్మకం. రంగు రంగుల చీరలు కొనుక్కోవాలి. రోజుకు ఒకోరకం మార్చాలి. ప్రతి సాయంత్రానికీ, అప్పుడే మడతలిప్పిన తెల్ల చీరలు కావాలి. బేఫికరుగా తిరగాలి. డబ్బుకు వెనక చూసుకోకూడదు. దానితో తెచ్చుకోగల సరదాలన్నీ తీర్చుకోవాలి. జీవితం తనకి అందమైన కల! ఆ కలలో, అందమైన మేడా, చిన్న కారూ, దాస దాసీజనం, పదిమందిలో పలుకుబడి, ఎంతటి వాళ్లనయినా వెనక్కి త్రిప్పించుకోగల ఆకర్షణా — యివే అనుక్షణమూ ఆమె కళ్లలో కనుపించి, ఆమె వాటిమధ్యనే ఉండదగిన దన్నట్లు నమ్మిస్తున్నాయి.

ఈస్థాయి అతనికి లేదు. మనిషికి ఆశ ఉంది. అవకాశమే తక్కువ. అందువల్ల వేటినీ గట్టిగా నమ్ముకోడు. నమ్మి నిరాశపొందడు.

అతను భర్తగా ఆమె పొందిన ప్రతిఫలం ఒక్క మగబిడ్డ!

ఎంతో అందంగా వూహించుకున్న జీవితం అతి సామాన్యంగా పల్చగా జారిపోవడం ఆమెకు యిష్టంలేదు.

ఆమె స్థాయికి వచ్చి అతను ఆలోచించలేడు. అసలు అది పుట్టుకతో రావలసిందే. ఇప్పుడు ఎన్ని అనుకున్నా ఏం లాభం ? కాలాతీతం అయిపోయింది.

అతనిలో ఏం ఉందని పెళ్లికి యిష్టపడింది? అందులోనూ, పెద్దవాళ్లకు తెలియకుండా ? ఇప్పుడు ఎన్ని అనుకుంటే మాత్రం కలిసి వచ్చేదేమిటి ? ఇప్పటికి ఒక్కనిజంతెలుసుకుందితను. మామూలుగా దారినపోయే మనుష్యులకంటె అతనిలో ఏ ప్రత్యేకతాలేదు. కాని, గోరంతలు కొండంతలు చేసి ఎదుటివాళ్ల మంచితనాన్ని సంపాదించగలడు. తను ఆ ముఖప్రీతికి లొంగిపోయింది. అతను, అతనంతటి మంచి మనిషి యింకెక్కడా లేడనుకుంది. సిగ్గుమాలిన పెళ్లి చేసుకుంది.

డబ్బు కావాలి. ఏదోవ్యావర్తి ఉండాలి. ఒంటరిగా దిగాలుపడి కూర్చోవడం తనకి చేతకాదు. కనక, ఏదో ఒకపని కల్పించుకోవాలి.

ఆమె నౌకరీ చేస్తానన్నది. అతను అనవసరం అన్నాడు. ఉన్నది చాలునన్న తృప్తి పొందితే చాలన్నాడు. ఆ మాటలు ఆమె మనస్సుకు పట్టలేదు.



స్త్రీ మూర్తి — యం. అప్పారావు...

తనమాట నెగ్గితీరాలన్న పట్టుదల ఆమెకు ఉంది. ఆమె అహం దెబ్బతింది. ఈ రోజుల్లో చాలామంది ఉద్యోగాలు చేసి సంపాదించు కుంటు న్నారు. ఆ సంగతి అతనికీ తెలుసు. పదిమందితో పూసుకుని తిరిగేవాళ్ల ఆర్భాటం అతనికి వెకిలిగా కన్పించింది. కొంత అసహనమూ ఉంది. విషయం ఒక్కటుంది. తనపై అపనమ్మకం, తన మంచితనాన్ని శంకించటం.

ఆమెకు నిర్దుష్టమైన లక్ష్యం ఉంది. అమీ, తుమీ తేల్చాలన్నది.

అది ఆరేళ్లనాటి మాట.

డైరెక్టు రిక్రూట్‌మెంట్ లో ఆమె మొట్ట మొదటి ఆఫీసరుగా ఎన్నిక అయింది. ఆవిషయం అతడికి యాధాలాపంగా చెప్పింది. అతడు విన నట్టే వూరుకున్నాడు.

ఆమెకిది నైతిక విజయం! చంద్రిక ఉద్యోగంలో చేరింది. అతడు బాచిలర్స్ క్వార్టర్స్‌కు మారిపోయాడు.

ఏడాదికొక వూరు చొప్పున ట్రాన్స్‌ఫర్ల మీద తిరుగుతుందామె.

భరత్ కుమార్‌కి యిప్పుడారేళ్లు. చిన్న బంగళా ఒకటిరెండువందలకు అద్దెకు తీసుకుంది. కారు కొంది. తీరిక సమయాల్లో లోపల కూర్చొని చెట్లవైపూ, పూలమొక్కలవైపూ చూస్తూ ఉంటుంది. పుస్తకాలు చదవటంలో ఆమెకు ఆసక్తి చచ్చిపోయింది. ఏ క్లబ్‌లోనూ ఆమె మెంబర్‌షిప్ తీసుకోలేదు. ఇంటికి వచ్చి కబుర్లు చెప్పేటంత చనువయినా ఆమెకు తెలిసిన వారిలో ఎవ్వరికీ లేదు. ఆమెకు అన్నీ ఉన్నాయి. కాని ఏమీలేనట్లుగానే అనిపిస్తుంది. అవసరాలకు తగిన అవకాశాలున్నాయి. మనస్సులో మాత్రం చెప్పరాని దిగులు! నిండుగా నవ్వుకునే స్థితిలో కూడా కళ్లనిరడా నీళ్లు!

అందమైన యిల్లు. కాని ఇంట్లో జీవంలేదు!

ఆట పూర్తికావచ్చింది. భరత్ కుమార్ క్లయిమాక్స్ సీనులో వూగిపోతున్నాడు. చంద్రికా రాణికి తెలివి వచ్చింది. ఏదోషాక్ తిన్నదానిలా కూర్చున్నచోటునుంచి లేచింది. కొడుకుని కుర్చీ మీదనుండి దింపి గుమ్మందగ్గరకు నడిపించుకొని వచ్చింది.

వెనక్కి వెనక్కి చూస్తూనే అమ్మతో వచ్చేశాడు వాడు.

లైట్లు వెలిగేలోగా ఆమె బయటపడింది. జనం బిలబిల్లాడుతూ వచ్చేసరికి ఆమె కారులో కూర్చుని ఉంది.

కారు బయలుదేరబోతూ ఉండగా ఎవరో చెయ్యి వూపారు.

కాని, కారు ఆగలేదు.

ఆరాత్రిఅల్లా ఆమె తలనొప్పితో బాధపడింది నిద్రపట్టలేదు. కళ్లు వాచాయి. తెల్లవారి నిద్ర లేదు అద్దంలో ముఖం చూసుకునేసరికి ఆమెకు ఏడుపు వచ్చినంతపని అయింది. ఆఫీసుకు సెలవు చీటీ పంపింది.

ఆరోజు తనకోసం ఆఫీసుకు ఎవరో వచ్చినట్లుగా/ మర్నాడు తెలిసింది. సన్నగా, పొడుగ్గా ఉంటాడని చెప్పారు.

ఆనాడంతా ఆమె పరధ్యానంగానేఉంది. నెత్తి మీద సమ్మెట పెట్టు పెట్టినట్టుగా తలబద్దలవుతూ ఉంది. మనస్సులో దేనికో చెప్పలేనంత బెంగ.

చాలా కాలం తర్వాత చంద్రికారాణికి మళ్లీ భగవంతుడు గుర్తుకు వచ్చాడు. పాపపుణ్యాలు, అదృష్టమూ జీవితాన్ని ఎంతవరకూ అదుపులో పెట్టుకుంటాయి అన్నది తనలో తను తర్కించుకొంది. మళ్లీ తన బలహీనతకు తననితానే తిట్టుకొంది. అద్దం చూసుకోడానికి కూడా ముఖం చెల్లలేదు.

సినిమా హాలుదగ్గర తనవైపు చెయ్యి వూపిన వారెవరు ? రమాకాంత్ తనని దూరం నుంచే గుర్తుపట్టాడా ?

ఏమో! ఎవరో ? ఎందుకో ?

ఆఫీసునుంచి వచ్చినామె వచ్చినట్లుగానే సోఫాలో దిగాలుపడి కూర్చుంది. ఎదురుగా 'టీపాయ్' మీద వార్తాపత్రిక పడి ఉంది. దానిమీదకు కళ్లుత్రిప్పలేదు. ప్రక్కనున్న కిటికీలోనుంచి సన్నగా తీగలు గాలికి కదులుతున్నాయి. వెలుపల ఉన్న అశోక వృక్షం క్రొత్తచిగుళ్లు తొడుక్కుంది పోర్టికో దగ్గర వెలుతురు పల్చబడుతూ ఉంది. భరత్‌బాబు ఎక్కడికో ఆడుకోడానికి వెళ్లాడు.

చంద్రికరాణి మెల్లగాలేచి అశోకవృక్షం క్రిందకు వెళ్లింది. పనివాడు పేముకుర్చీ తెచ్చివేశాడక్కడ. అందులో కూర్చొని వెనక్కు చేర్లబడింది.

తానొక పెద్దప్రవాహంలో కొట్టుకు పోతున్నట్లనిపించింది చంద్రికకు. ఏమిటి యీ జీవితం ? ఈనాడు తనలో యింత అసంతృప్తి ఎందుకు పేరుకున్నది? పద్దెనిమిదేళ్ల వయస్సులో జీవితాన్ని తాను ఎలా వూహించుకుంది ? ఏరి కోరి తెచ్చుకున్న స్వాతంత్ర్యంవల్ల తానుపొందగలిగిందేమిటి ? ఏమిటో తెరచాప విసురుకి ఎటో కొట్టుకు పోతున్నట్లనిపిస్తోంది. ఈ అసంతృప్తులూ, యీ అలజడలూ, యీ గాలి రొదలూ, యీ తుఫానులూ ఎందుకువస్తాయో తెలియదు.

'తనకి యీ జీవితంలో ఒంటరితనం ఉండకూడదు. ఎప్పటికీ యీ సాయంత్రాలు యిలా చల్లగా ఉండాలి. కాలంలో శిశిరం తప్పుకోవాలి. మల్లెలూ, గిరిమల్లెలూ జల్లుగా కురియాలి. సంపెంగలూ సన్నజాజులూ ఆమడ దూరం నుంచి కూడా ఆహ్వానించాలి. అందమైన కలలు కూడా అందంగా నవ్వుకోవాలి! ఒంటరిగా ఉన్నప్పుడు యిలా ఎన్నెన్నో పిచ్చి వూహలు వస్తూండేవి అప్పుడు. లేకపోతే అతనితో పరిచయం కలుగుతుందని తాను కలగన్నదా ? అందమూ చదువూ డబ్బూ, హోదా వీటిలోఏమి చూడగలిగిందని ? ఏమిటి పొందగలిగిందని ?

ఒక్కటి మాత్రం చంద్రికకు యిప్పటికీ జ్ఞాపకం వుంది. అతనికి ఆరోజున చేతిలో కానీ లేదు. తనకోసం, కేవలం తనని చూడడం కోసం ఎన్నెన్నోసార్లు వచ్చేవాడు. తనని మెప్పించడం కోసం చిన్న చిన్న అబద్ధాలాడేవాడు. అవి అబద్ధాలని తనకు తెలిసినా, ఎన్నడూ పైకి తేలలేదు. దానికితోడు లోపల ఎంతో గర్వం కలిగేది. అతను తన వైపు చూస్తున్నంత సేపూపట్టరానిసంతోషం కలిగేది. హృదయం నిండినట్లు వుండేది.


చంద్రికారాణి స్థిమితంగా కూర్చోలేక పోయింది. లోపలికి పోదామని లేవబోతూండగా ఎదురుగా రమాకాంత్ భార్యా గేటుదాటి లోపలకు వస్తూండడం గమనించింది.

రమాకాంత్‌కు యిప్పుడు మంచి ఒళ్లు వచ్చి వెనకటివలె కాకుండా మనిషిలో యిప్పుడు నిండుతనం కన్పిస్తోంది. స్వతహాగా మనిషి ఎరుపు. దానికితోడు తెల్లటి దుస్తులు మెరిసిపోతున్నాయి. మీసకట్టు పొడుగ్గాసాగి, నవ్వినప్పుడు బుగ్గలమీద మడతలు పడేచోట కొద్దిగా వంపులు తిరిగింది. పల్చని నొక్కుల క్రాపు తెల్లచొక్కామీద లేతరంగు మబ్బు 'టా'పైన యిటూ అటూ రెండు గడ్డిపూలు కన్పిస్తున్నాయి.

అతన్ని తప్పించుకొని ఆమె ముందుకు వచ్చింది.

''నమస్కారమండీ!'' ఆమెనవ్వుతూ అన్నది.

ప్రతి నమస్కారం చేసి చంద్రిక వాళ్లని ఆహ్వానించింది.



# వాలుగాలిలో పడవ...

పోర్టికో దగ్గరవున్న నౌకరు వీళ్లను చూసి కుర్చీలు తెచ్చి వేశాడు.

వారిద్దరి వెనుక యింకొక వ్యక్తి కూడా వచ్చాడు.

చంద్రికారాణి గుండెలు అదిరి పడ్డాయి.

అతడు సన్నగా, పొడుగ్గా వున్నాడు.

చామన ఛాయ ముఖం, నవ్వినప్పుడు అతని కళ్లు చేప కళ్లు లాగున్నాయి.

రమాకాంత్ వాళ్లని పరిచయం చెయ్యబోతూ వుంటే ఆమె అడ్డు పెట్టింది.

''నాపేరు కల్పన. వీరు మావారు. యీమెన కాల వున్నాయన మా డ్రైవరు గారు!'' అని నవ్వింది కల్పన.

ఆయన తేలిగ్గా నవ్వేశాడు.

''నాపేరు విశ్వేశ్వరరావండీ!''

''నమస్కారం!'' అన్నది చంద్రిక.

రమాకాంత్ గొంతు సవరించుకున్నాడు.

''స్త్రీని సృష్టించే ముందు బ్రహ్మదేవుడు గారు ఏం చేశాడంటే ఆమె గారికి ఏ అపాయమూ రాకుండా కనిపెట్టి వుండడానికి మనస్సుకి నొప్పి కలిగించకుండా నడుచుకోడానికి అవసరాలు కనిపెట్టి ఉండడానికీ, ఒకవిధమైన చిత్రమైన జీవిని యీ ప్రపంచంలోకి విడుదల చేశాడు. ఏదో ఒక స్త్రీని మనస్సులో ఆరాధించని మగవాడంటూ వుండడు. అవకాశం వున్నంతవరకూ మగవాడిచేతి సేవ చేయించుకోని స్త్రీ అంటూ వుండదు.''

రమాకాంత్ చెప్పేదానికి అడ్డువచ్చి టపీమని ఆపేసింది కల్పన.

''మీరనదల్చుకున్నది నాకు తెలుసులేండి! మీరు చాలా తెలివైన వారని అనుకుంటూ వుంటారు. కనక మీరెప్పుడూ ఆడదానికి తలొంచరు. విశ్వేశ్వరరావుగారు మంచివారు కనుక, ఎప్పుడేనా అలా తిరగడానికి వెళ్లినపుడు సరదాగా మన కారు డ్రైవ్ చేస్తూంటారు. ఆయన డ్రైవింగుతో మీకేమీ పేచీలేదు. ఉన్నదల్లా, నేను అడగ్గానే వారు 'ఓబ్లైజ్' చేస్తున్నందుకు కదూ?'' అంటూ తేలికగా నవ్వేసింది కల్పన. అలా నవ్వుతున్నపుడు ఆమెని

రెండు పళ్లు కొంచెం ముందుగా కన్పిస్తూ వుంటాయి.

విశ్వేశ్వరరావు ముసిముసిగా నవ్వుకున్నారు.

రమాకాంత్ చంద్రికారాణి వైపు తిరిగి చిత్రంగా కనుబొమలు ఎగురవేశాడు.

చంద్రిక కూడా నవ్వింది.

సూర్యాస్తమయం కనక అశోక వృక్షం ఆకులు బంగారు రేకుల్లా తళతళలాడుతున్నాయి ఎర్రటి ఆకులతో సన్నని తీగ ఒకటి ఆ చెట్టును చుట్టుకొని పైకి ప్రాకుతూంది. పోర్టికో ముందున్న పూల కుండీల్లో నౌకరు నీళ్లు పోస్తున్నాడు.

"నేనీవూరొచ్చి నాలుగేళ్లయింది. మన క్లాస్‌మేట్సు వాళ్లూ చాలామంది యిక్కడ వున్నారు కానీ ఎప్పుడో వాళ్లని కలుసుకోవడమే పడదు. మొన్న రాంబాబు కన్పించాడు. ఏవో మాటల సందర్భంలో నువ్వు ప్రస్తుతం యిక్కడ ఉన్నట్టుగా వెంకటరెడ్డి చెప్పాట్ట. నిన్ననే వద్దామనుకున్నాను కాని తీరిక చిక్కలేదు. కల్పన కారు తీసుకుని క్లబ్‌కి వెళ్లిపోయింది. లేడీ హైదర్ క్లబ్బులో ఆవిడగారు మెంబరులే. పనిలో పని నిన్నుకూడా క్లబ్‌లో చేర్పిద్దామని నాతో కూడా వచ్చింది యిప్పుడు. అన్నట్టు మెంబర్‌షిప్ ఫారం కూడా తెచ్చావేమిటి కల్పనా?" అంటూ భార్యవైపు తిరిగి వెటకారంగా నవ్వాడు రమాకాంత్.

"మరే! అడ్డమైన క్లబ్‌లకీ మీరు తిరగొచ్చుకాని మా క్లబ్బంటే వేళాకోళమా? అయినా మా మాన్యువల్ ఫంక్షనుకీ వాటికీ ఆహ్వానాలు మీకు అందక పోతేమాత్రం గిలగిల్లాడిపోతారు.!"

"క్లబ్బులు ఎవరివయినా ఫంక్షన్ అందరివీ కదండీ!" అంటూ విశ్వేశ్వరరావుగారు చేపకళ్లని సాధ్యమైనంతగా విప్పారిస్తూ అన్నాడు.

"మరే! మరే! అల్లాగే అనుకుంటూకూర్చోండి యీ సంవత్సరం చంద్రికారాణి గార్ని సెక్రటరీని చేసి, ఇనాగురల్ ఫంక్షన్ నాడు యీ మగాళ్లందరినీ బయట మా కార్లు కాపలా కాయడానికి గేటు దగ్గర కూర్చోబెడతాం." కళ్లు చక్రాల్లా తిప్పుతూ అన్నది కల్పన.

రమాకాంత్ తీవిగా 'టై' సవరించుకున్నాడు "అధమం అందుకైనా మేము పనికొస్తే చాలా ధన్యులం!"

చంద్రికారాణి సన్నగా నవ్వింది. కుర్చీలో నుంచి లేచి, కొంగు సర్దుకొని 'యిప్పుడే వస్తాను' అని చెప్పి బంగళా వైపుకు వెళ్లింది.

ఆమె నడచి అలా వెళ్తుంటే రమాకాంతరావూ, విశ్వేశ్వరరావూ ఆమె వైపుకే చూస్తూ ఉండటం కల్పనకు నచ్చలేదు. ఆవిడ నడకలో ఏముందనో మరి! తనకీ ఆవిడకీ తేడా చూసుకుంటే వంపులు కొంచెం స్పష్టంగా కనిపిస్తాయి అంతే!

మొగుణ్ణి మోచేత్తో పొడిచి తనవైపుకు తిప్పుకుంది కల్పన.

రమాకాంత్ వెర్రివాడిలా చూశాడు.

"సొంతిల్లేనా?"

"కాదనుకుంటాను"

ఆమె పెదవి విరిచింది.

"జీత మెంతుంటుందో?"

"విశ్వేశ్వరరావుగారి జీతంకంటె వందరూపాయలు ఎక్కువ వుండవచ్చు!"

తెల్లబోయింది కల్పన. ఇదొక ఛాలెంజి. ప్రతిదానికీ విశ్వేశ్వరరావుగారిని కొలబద్దగా తీసుకోడం తనను హేళన చేయడమే మరి!

"పాపం, ఏమీ ఎరగనివాణ్ణి మధ్యలో ఆయన్నెందుకు తీసుకొస్తారు?" ఆమెకు ఉడుకుమోతుతనం కూడా వచ్చింది.

అతడు నవ్వాడు.

"కారుందా?"

"కనిపిస్తోందిగా!"

"ఫియట్!"

"విశ్వేశ్వరరావుగారిది కూడా అదేగా!"

"అయితే మాత్రం, యిది పాతమోడలే!"

ఈసారి అతడు మాట్లాడడానికి అవకాశం పోయింది.

ఆమె గర్వంగా నవ్వింది.

చంద్రికారాణి లోపల్నించి వచ్చింది. వెనకాలే ట్రేతో కాఫీలూ, బిస్కట్లూ తీసుకుని నౌకరు కూడా వచ్చాడు. చంద్రికారాణి తోట గురించి, విశ్వేశ్వరరావుగారి కొత్తమోడల్ కారు గురించి, రమాకాంతరావు ఉద్యోగం గురించి, యింగ్లీషు సినిమాల్లో టెక్నిక్ గురించి, లేడీ హైదరీక్లబ్ విశేషాలూ ఎన్నోవిషయాలు చాలాసేపు మాట్లాడుకున్నారు.

కాశీరత్నం తీగెవెనక వైపునుంచి లెఫ్ట్‌రైట్ కొట్టుకుంటూ భరత్‌బాబు చక్కావచ్చాడు. రమాకాంత్ వాణ్ణి ఒళ్లో కూర్చోబెట్టుకుని ఎన్నో కబుర్లు వాగించాడు. వాడి మాటలు వింటూ ఉంటే అతనికి ఎంతో ముద్దొచ్చింది.

ముప్ఫైయ్యేళ్లు దాటేదాకా పిల్లలు పుట్టే ప్రమాదం రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంది. కానీ, భరత్‌కుమార్‌ని తనభర్త ఒళ్లో కూర్చోబెట్టుకుని ముద్దులాడుతుంటే తనలో ఏదో లోపాన్ని వేలెత్తి చూపిస్తున్నంతగా బాధపడింది కల్పన.

బాగా చీకటిపడింది. అందరూ లేచారు. చంద్రికారాణి వాళ్లని బంగళాలోకి తీసికెళ్లి అంతా చూపించింది. కల్పన అన్నీ పరీక్షగా చూసి, తన యింట్లో ఉన్నవాటికీ, అక్కడ ఉన్నవాటికీ ఖరీదుల్లోనూ సౌందర్యంలోనూ ఉన్న తేడాలు అందరికీ విప్పిచెప్పింది.

విశ్వేశ్వరరావుగారు కారు పోర్టికోలోకి తెస్తూ హారన్‌కొట్టాడు. కల్పనా, భర్తా చంద్రికారాణి దగ్గర సెలవు తీసుకున్నారు.

కార్లో కూర్చోబోతూ కల్పన అంది:

"మీఅబ్బాయిని తీసుకునిమీరూ, మీవారూ ఒకసారి మాయింటికి రండి!"

చంద్రికారాణి కొయ్యబారినట్లయిపోయింది. కారు కదిలిపోయింది.

ఆ సాయంత్రం చాలా ప్రశాంతంగా గడుస్తుందని ఆశపడ్డది చంద్రిక. కల్పన ఆహ్వానంలో వ్యంగ్యం మాటిగా తగలటంవల్ల ఆత్మాభిమానం దెబ్బతింది. రాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

తన జీవితం ఇలా ఎందుకు కావాలి? ఇలా నలుగురిలో తాను నవ్వులపాలెందుకు కావాలి? తనలో లోపాన్ని అందరూ వేలెత్తి ఎందుకు చూపాలి? అయ్యో! దేవుడా! ఏమిటీ ప్రపంచం?

అర్ధరాత్రివేళ భరత్‌బాబు ఆకలి అంటూ లేచాడు. లడ్డూలు కావాలంటాడు. అంతరాత్రి వేళ తాను ఎక్కణ్ణించి తెస్తుంది? వాడిమీద విసుక్కుంది. ఇంకా పేచీ పెట్టాడు. చడ్డీమీద రెండు వాయించింది. వాడు యింకా బిగ్గరగా ఏడ్చాడు. ఏడ్చి ఏడ్చి అలానే నిద్రపోయాడు. తన బలహీనతకి తనని తాను తిట్టుకుంది ఆమె. తలగడలో తలదూర్చి చాలాసేపు యేడ్చింది.

ప్రేమంతా కూడగట్టుకొని నిద్రపోతున్న వాడి చిబుకం ముద్దుపెట్టుకుంది. వాడి ముఖంలోకి చూసినప్పుడల్లా తాను ఎంత వద్దనుకున్నా అతను జ్ఞాపకంవస్తాడు. ముఖమూ, కళ్లూ అన్నీఅతనివే! ఒక్క రంగుమాత్రం తనది.

మళ్లీ యింతకాలానికి భర్తనిగురించిచంద్రికారాణి చాలా దీర్ఘంగా ఆలోచించింది.

అతనిపేరు సుందరరావు. సౌమ్యుడు. అంతకు మించి మంచివాడు. కాని ఎంతో ఆత్మాభిమానం కలవాడు. "ఆడవాళ్లు నయం మీకంటె!' అనేదితానని మాట పట్టింపు వచ్చింది. ఆమె దారికి అతడు అడ్డు రాలేదు.

ఆ జ్ఞాపకాలన్నీ ఒక్కొక్కటే వెంటాడుతున్నాయి. కొడుకుని గుండెల్లో పొదువుకొని బలవంతాన కళ్లు మూసుకుంది.

మర్నాడుచాలా ఆలస్యంగానిద్రలేచింది. రాత్రి అంతా పడిన మనస్సంక్షోభానికి తెల్లవారగట్లకి కొంచెం తేలికపడింది.

ఇన్ని ఉన్నా జీవితంలో ఆమె తేలికగా ఎందుకు నవ్వలేకపోతూందో రమాకాంతరావుకు తెలుసు. సుందర్రావు కథకూడా వెంకటరెడ్డిద్వారా ఆరా తీశాడు. చంద్రికారాణిని కల్పనతో పోల్చి చూసుకొన్నాడు.

ఆమెది చాలా సున్నితమైన హృదయం. తన భార్యలాగ ఎక్కడికక్కడ తృప్తి తెచ్చుకోలేదు. విశ్వేశ్వరరావువంటి వాడితో పరిచయం చేసుకుని పదిమందిలోనూ అతణ్ణి లోకువ చేస్తూకూడా తనచుట్టూ త్రిప్పుకోగల నేర్పు లేదు. అంటే, చదువుకున్న స్త్రీకి యీనాగరికత యీయుగం అవకాశాలన్నిటినీ వినియోగించుకోగల నేర్పు

తరువాయి 48వ పేజీలో

ఏమాత్రమూ లేదు. జీవితంలో ఒక ఉద్రేకం వచ్చినప్పుడు చేసినపనిని సాధ్యమైనంతవరకూ మరచిపోవటానికి ప్రయత్నించలేదు. పరిచయాల ప్రాపకాలమీద తృప్తి తెచ్చుకోలేదు. ఆమె మనసు ఎప్పుడూ వెనకటి విషయాలవైపు పట్టి లాగుతుంది. అది కొంతవరకూ బలహీనత. ఇప్పుడు, కల్పన ప్రయోగించిన వ్యంగ్యానికి ఆమె తట్టుకోలేక పోతున్నది!

తరవాత ఒకరోజున రమాకాంతరావు, చంద్రికారాణి దగ్గిర సుందర్రావు ప్రస్తావన తెచ్చాడు. ఆమె ముఖం పాలి పోయింది. ఇతడి ప్రశ్నలకు .ఆమె దగ్గిర నుంచిపూర్తి సమాధానంరాలేదు. తను మొగవాడు. యిటువంటి విషయాల్లో ఆడవాళ్లతో చాలా సున్నితంగా వ్యవహరించాలి. కల్పన వల్ల తనకు ఉపయోగంలేదు. సరికదా, పరిస్థితి యింకా విషమించవచ్చు. అందువల్ల అంతటితో అతను, ఆవిషయంలో ఆమెను బాధ పెట్టటం మంచిది కాదని విరమించుకున్నాడు

ఆదివారాలంటే చంద్రికారాణికి భయం.. సెలవు రోజున కూడా ఆఫీసుకు పోవలసినంత పెద్ద పనేమీకాదు తనది. ఒంటరిగాయింట్లోనే కూర్చోవాలి. భరత్‌బాబుకి ఒక్క నిమిషం యింట్లో కాలునిలవదు. తనకి తనే విసుగేసు తుంది!

ఆసాయంత్రం చంద్రిక రమాకాంతరావు యింటికి వెళ్లింది. లోపలి గదిలో విశ్వేశ్వర్రావు గారూ, కల్పనా కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటూ తెగ నవ్వుకుంటున్నారు. ఆమె అదిరిపడింది.

అతను వూళ్లో లేడట. నాలుగు రోజులో వస్తాడట.

చంద్రిక తిరిగి వచ్చేసింది.

నందివర్ధనాలు చల్లినట్లుగా యింటినిండా పరచుకొని ఉంది వెన్నెల. పెళ్లినాడు అతడి చేతికి కట్టిన మల్లెపూల దండ గుర్తుకువచ్చింది. అతను అప్పుడన్నాడు, "చంద్రా! యీ మల్లెల దండ నువ్వయితే దీని పరిమళం నీమనస్సు!" చంద్రికారాణి కుంచించుకు పోయింది.

"దేవుడా! యీ జీవితంలో నాకింకేమీ వద్దు. ఆ ఒక్కమాట మళ్లీ ఆ పెదవులనుంచి వినిపించు...చాలు!" అని మనసారా కోరుకుంది చంద్రిక.

రమాకాంతరావు వూర్నుంచి రాగానే ఒక కొత్త విషయం తెలుసుకున్నాడు. సుందర్రావు బాచిలర్స్ క్వార్టర్సు వదిలివేశాడు. ఉద్యోగం మానేశాడు. గోదారంలో ఎక్కడో వుంటున్నాడట.

ఆ రోజున సూర్యాస్తమయం కాకుండానే చంద్రోదయం అయింది. రమాకాంతరావు కారులో చంద్రికారాణి, భరత్‌బాబూ, తప్ప ఇంకెవరూ లేరు. కొండలూ, గుట్టలూ, పచ్చటి చెట్లూ, అందమైన తోటలూ, వెనక్కు తప్పుకుంటున్నాయి.

ఒక పెద్ద బావి ముందు కారు ఆగింది. మోటారు రేడియేటర్‌లో నీళ్లు పొయ్యడానికి రమాకాంతరావు బకెట్ తీసుకుని బావిదగ్గరకు వెళ్లాడు. అతన్ని అలా వెళ్లనిచ్చి భరత్‌బాబు ప్రక్కనున్న తోటలోకి పరుగెత్తాడు. వాణ్ణి వెతుకుతూ చంద్రికారాణి కూడా వెళ్లక తప్పింది కాదు.

పచ్చటి ఆ తోటలో వనలక్ష్మిలా నడుస్తూ వుంటే ఆమె మనస్సు సంతోషంతో తేలి పోతోంది.

పది నిమిషాల వరకు భరత్‌బాబు కనిపించ లేదు. బంగళా దగ్గరకు వెళ్లింది. అక్కడ మనుష్యుల అలికిడి లేదు. తిరిగి వస్తూవుండగా ఎడమవైపు నుంచి వాడు 'అమ్మా!' అని పిలిచాడు. ప్రక్కకు తిరిగి చూసింది.

జుట్టు రేగిపోయి వుంది. గడ్డం మాసిపోయింది. చేతుల్నిండా మట్టి అట్ట కట్టుకొని వుంది. చిరిగిన బనీను లోపల్నించి వికృతంగా లేచి ఎముకలు కనిపిస్తున్నాయి. కళ్లక్రింద నల్లటి చారలున్నాయి. కాని కళ్లు మాత్రం అవే.

అతని చెయ్యి పట్టుకొని భరత్‌బాబు తన వైపు వస్తున్నాడు.

ఆమెకు అడుగు ముందుకు పడలేదు. కాళ్లు వణికి పోతున్నాయి. పెదాలు కదులుతున్నాయి. కళ్లనిండా నీళ్లు నిండాయి.!

నిలుచున్నచోటనే వాలిపోయింది చంద్రికా రాణి.

భరత్‌బాబు అతని ముఖంలోకి తెల్లబోయి చూస్తున్నాడు.

రమాకాంతరావు కాళ్ల చప్పుడు తోటలో వినిపించింది.

కాని, అతను రాకముందే బంగళా ముందు సన్నని దీపం వెలిగింది. ఆ వెలుగులోనే పద్దెనిమిదేళ్ల అమ్మాయి మెట్లు దిగి ఈమె వైపుకి రావడం గుర్తించింది చంద్రికారాణి. భరత్‌బాబు ఆమె వస్తున్న వైపుకే దవుడు తీశాడు

సూర్యుడు అస్తమించాడు. వెన్నెల పూర్తిగా పరుచుకుంది.

సుందర్రావు చంద్రికారాణి చేతుల్ని అందుకుని కళ్లకద్దుకున్నాడు.

"ఎన్నోసార్లు నిన్ను కలుసుకోడానికి ప్రయత్నించాను. నేను రాసిన ఉత్తరాల్లో ఒక్కటైనా నీకు అందుతుందేమో అని ఆశపడ్డాను. నువ్వు యీ వూరు వచ్చావని తెలిశాక కూడా చివరికి యీ పరిస్థితిలో యిలా కలుసుకోగలమని వూహించలేక పోయాను. నీకు చాలా అన్యాయం చేశాను చంద్రా!"

"తప్పు! అలాకళ్లు తడుపుకోకండి. చెల్లాయ్ చూస్తే జడుసుకుంటుంది. ఇక మాట్లాడలేక అతని చేతుల్లో వాలిపోయింది చంద్రికారాణి.

"రేపే ఉద్యోగానికి రాజీనామా యిస్తాను. బంగళా ఖాళీ చేసేస్తాను. నౌకర్లని పంపేస్తాను. కారు అమ్మేస్తాను. ఇక్కడే, యిలాగే, పచ్చని పసరికలోకూర్చుని, పువ్వులకదలికలు చూస్తూ ఆకుల నీడలకి సోలిపోతూ..... యిలాగే.... యీపాదాల దగ్గర.... ఎప్పుడూ యిక్కడే....."

ఆమె గుండెల వేగాన్ని మించి మనస్సు ఆలోచించుకుంటూంది. అప్పుడు ఆ క్షణంలో తన జీవితాన్ని అతనికి పునరంకితం చేసుకున్నపుడు కలిగిన ఆనందమూ, తృప్తీ, ప్రతికి వుండగా మరెన్నడూ మరచి పోలేదు.

ఆమె ముఖాన్ని తన గుండెల్లో పొదివుకొని అతను అప్పుడన్నాడు. "నువ్వు యీ భూదేవి వయితే, నీమనస్సే యీ పరిమళం చంద్రా!"

ఆ మాటలతో హృదయం పొంగి రాగా అతని పాదాల మీద ముఖం దాచుకుంది చంద్రికారాణి.

★